

# భారత్ పసిడి పరుగు

- 4X400 మిక్స్‌డ్ రిలేలో స్వర్ణ పతకం
- ఏషియన్ రిలే చాంపియన్‌షిప్స్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న ఏషియన్ రిలే చాంపియన్‌షిప్స్ తొలి ఎడిషన్‌లో భారత మిక్స్‌డ్ 4x400 మీటర్ల రిలే బృందం సత్తా చాటింది. మహ్మద్ అజ్మల్, అమోజ్ జాకబ్, సుభా వెంకటేశన్, తెలుగు అమ్మాయి శ్రీదండి జ్యోతికతో కూడిన నలుగురు అథ్లెట్ల బృందం స్వర్ణం గెలుచుకుంది. సోమవారం జరిగిన 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌ను 3 నిమిషాల 14.12 సెకన్లలోనే పూర్తిచేసిన అథ్లెట్లు సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పారు. తద్వారా గతేడాది ఆసియా క్రీడల్లో (హాంగ్జౌ) నమోదైన 3 నిమిషాల 14.34 సెకన్ల రికార్డును బ్రేక్ చేశారు. అయితే పారిస్ ఒలింపిక్స్‌లో బెర్తును దక్కించుకోవడానికి మాత్రం తాజా ప్రదర్శన సరిపోలేదు. వరల్డ్ అథ్లెటిక్స్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ప్రదర్శన 21వ స్థానంలో నిలవగా 15 లేదా 16వ స్థానం వస్తే పారిస్ కోటా ఖాయమయ్యేది. సోమవారం నాటి పోరులో భారత బృందం గనక 3:13.56 నిమిషాల్లో రేసును పూర్తిచేస్తే అప్పుడు 16వ స్థానంలో నిలిచి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగే అవకాశముండేది. కానీ నిమిషం వ్యవధిలో భారత్ ఆ చాన్స్ కోల్పోయింది. టాప్-16లో ఉన్న టీమ్స్ ఒలింపిక్స్‌లో పాల్గొంటాయి.

# సర్జరీ తర్వాతే తుది నిర్ణయం!



ఢిల్లీ: చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌కు గుడ్ బై చెబుతాడని, ఇదే అతడి ఆఖరి సీజన్ అని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నా ఇప్పటి దాకా ఆ విషయమ్మీద అటు మహేంద్రుడు గానీ ఇటు చెన్నై యాజమాన్యం గానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. మోకాలి గాయంతోనే ఐపీఎల్-17 ఆడిన ధోనీ.. శస్త్రచికిత్స నిమిత్తం త్వరలోనే లండన్‌కు వెళ్లనున్నాడట. సర్జరీ తర్వాతే అతడు రాబోయే సీజన్ వరకూ వేచి చూస్తాడా..? లేక ఆలోపే రిటైర్మెంట్ ప్రకటిస్తాడా..? అన్నదానిపై స్పష్టత రానున్నట్టు సమాచారం.



సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ముంబైలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, మిస్టర్ '360' సూర్యకుమార్ యాదవ్.

# దీప్తి ప్రపంచ రికార్డు

**పారా అథ్లెటిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం**
**పారిస్ పారాలింపిక్స్‌కు బెర్తు ఖరారు**
**సత్తాచాటిన తెలంగాణ యువ అథ్లెట్**



కోబ్: జపాన్‌లోని కోబ్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక పారా అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ స్ప్రింటర్ దీప్తి జివాంజీ సంచలనం సృష్టించింది. సోమవారం జరిగిన మహిళల 400 మీటర్ల టీ20 కేటగిరీలో దీప్తి.. 55.06 సెకన్లలోనే పరుగును పూర్తి చేసి స్వర్ణం కైవసం చేసుకోవడంతో పాటు సరికొత్త ప్రపంచ రికార్డునూ నెలకొల్పింది. ఇదే పోటీలో అసైల్ ఒండర్ (55.19సె), లిజాన్‌శెలా అంగులో (56.68సె) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. దీంతో గతేడాది అమెరికా పారా అథ్లెట్ బ్రియాన్నా క్లార్క్ ఇదే టోర్నీలో నమోదుచేసిన 55.12 సెకన్ల రికార్డును ఈ కల్లెడ అమ్మాయి తిరగరాసింది. త్వరలో జరగనున్న పారిస్ పారాలింపిక్స్ టోర్నీకి కూడా అర్హత సాధించింది. 2023 పారా ఆసియా క్రీడల్లో పసిడి నెగ్గిన దీప్తి.. తాజాగా అదే ప్రదర్శనను పునరావృతం చేయడం గమనార్హం. పేద రైతు కుటుంబం నుంచి దీప్తి అంచెలంచెలుగా ఈ స్థాయికి ఎదిగింది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ శిక్షణలో రాటుదేలిన దీప్తి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా పతకాలు కొల్లగొడుతున్నది. ట్రాక్‌పై చిరుతను తలిపిస్తూ పోటీపడ్డ ప్రతీ టోర్నీలో కచ్చితంగా పతకం సాధిస్తూ దేశ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నది. తాజాగా ప్రపంచ పారా అథ్లెటిక్స్ టోర్నీలో పసిడి పతకంతో మెరిసి అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నది. కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్..దీప్తి ప్రపంచ రికార్డును ఎక్స్‌లో ప్రత్యేకంగా అభినందించారు. మరోవైపు పురుషుల ఎఫ్56 డిస్కస్ త్రో విభాగంలో యోగేశ్ కతునియా రజతం గెలిచాడు. ఇదే టోర్నీలో రెండ్రోజుల క్రితం ప్రీతి పాల్ (మహిళల 200 మీటర్ల టీ35 కేటగిరీలో) కాంస్యం గెలుచుకోగా పురుషుల టీ47 హైజంప్ విభాగంలో నిషద్ కుమార్ రజతం నెగ్గాడు.

## అంచలంచెలుగా

అథ్లెటిక్స్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న దీప్తి..అంచలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. తాను పుట్టిన పర్వతగిరి మండలం కల్లెడ గ్రామం తప్ప..బయటి ప్రపంచం గురించి పెద్దగా తెలియని దీప్తి.. ఇప్పుడు దేశవిదేశాల్లో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నది. కెరీర్ ప్రారంభంలో రెగ్యులర్ అథ్లెటిక్స్‌లో పోటీపడ్డ దీప్తి..ఆ తర్వాత పారా అథ్లెటిక్స్ వైపు అడుగులు వేసింది. చివరిసారి 2022 జాతీయ ఇంటర్‌స్టేట్ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ ఈ అమ్మాయి..పారా అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నది. మానసికంగా పరిణితి లేని విభాగమైన టీ20లో పోటీపడుతూ పతకాలు సాధిస్తున్నది ఈ ఓరుగల్లు ముద్దుబిడ్డ.



## బోపన్నకు జోడీ ఎవరు?

ఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరపున టెన్నిస్ డబుల్స్ విభాగంలో స్టార్ ప్లేయర్ రోహన్ బోపన్నతో జట్టు కట్టేదెవరు? అన్నదానిపై ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా) మల్లగుల్లాలు పడుతోంది. నిబంధనల ప్రకారం టెన్నిస్ ర్యాంకింగ్స్ టాప్-10లో ఉండే ఆటగాడు తనకు నచ్చిన ప్లేయర్‌ను ఎంపిక చేసుకునే అవకాశముంటుంది. ప్రస్తుతం నాలుగో ర్యాంకులో ఉన్న బోపన్న.. తనకు జోడీగా శ్రీరామ్ బాలాజీ, యూకీ బాంబ్రీ పేర్లను సెలక్షన్ కమిటీకి పంపినట్టు తెలుస్తోంది.

## ఫ్రెంచ్ ఓపెన్ నుంచి రడుకాను ఔట్

పారిస్: ఈ నెల చివరి వారంలో మొదలుకాబోయే ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ నుంచి బ్రిటన్ బామ ఎమ్మా రడుకాను వైదొలిగింది. రోలండ్ గారోస్‌లో సోమవారం నుంచే అర్హత రౌండ్‌లు మొదలు కాగా.. వీటిలో పాల్గొనాల్సి ఉన్న రడుకాను.. ఎర్రమట్టి కోర్టు కంటే గ్రాస్, హార్డ్ కోర్టులపై రాణించేందుకు దృష్టి సారించినట్టు తెలిపింది. 2021లో యూఎస్ ఓపెన్ నెగ్గిన ఈ బ్రిటన్ స్టార్.. జులైలో జరగాల్సి ఉన్న వింబుల్డన్‌కు సిద్ధమవుతోంది.




# తొలి అడుగు ఎవరిదో?

**నేడే ఐపీఎల్ తొలి క్వాలిఫయర్ • కోల్‌కతాతో హైదరాబాద్ కీలక పోరు • గెలిస్తే నేరుగా ఫైనల్‌కు అర్హత**

అహ్మదాబాద్: రెండు నెలలుగా క్రికెట్ అభిమానులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతున్న ఐపీఎల్-17 నాకౌట్ దశకు చేరుకుంది. క్వాలిఫయర్-1లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్ వేదికగా టేబుల్ టాపర్ కోల్‌కతా.. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్‌ను ఢీకొననుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం ఉండటంతో మరో మ్యాచ్ (క్వాలిఫయర్ 2) ఆలోచన లేకుండా ఇరు జట్లూ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. సీజన్ ఆసాంతం నిలకడగా రాణిస్తూ సమిష్టి ప్రదర్శనలతో ప్లేఆఫ్స్ చేరిన ఈ రెండు జట్లలో మ్యాచ్ విన్నర్లకు కొదవలేకపోవడంతో మోతేరా స్టేడియంలో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది.

**'సాల్ట్' లేని కోల్‌కతా..**

ఈ సీజన్‌లో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీ అయిన ఫిల్ సాల్ట్-సునీల్ నరైన్ బాదుడుకు బలికాని ప్రత్యర్థి లేరంటే అతిశయోక్తి లేదు. కానీ ప్లేఆఫ్స్‌లో కేకేఆర్‌కు సాల్ట్ లేకపోవడం ఎదురుదెబ్బే. జాతీయ జట్టు (ఇంగ్లండ్) బాధ్యతల నిమిత్తం అతడు కోల్‌కతాను వీడాడు.ఈ నేపథ్యంలో కేకేఆర్ టాప్ స్కోరర్ నరైన్ (461) పై మరోసారి భారీ ఆశలే పెట్టుకుంది. అతడిని త్వరగా ఔట్ చేస్తే మిడిలార్డర్ కూడా తడబడుతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నా అతడూ ప్రమాదకారే. వెంకటేశ్ అయ్యర్, నితీశ్ రాణా నిలకడకు తోడు ఆఖర్లో ఆండ్రీ రస్సెల్ మెరుపులు మెరిపిస్తే హైదరాబాద్‌కు తిప్పలు తప్పవు. ఆడేది తక్కువ బంతులే అయినా రమణ్‌దీప్ సింగ్ భారీ హిట్టింగ్‌లతో కీలక పరుగులు రాబడుతున్నాడు. కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ బౌలింగ్ దళం వీళ్లను ఎలా కట్టడి చేస్తుందన్నది ఆసక్తికరం.

**వాళ్లిద్దరి మీదే ఆశలు..**

హైదరాబాద్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన ట్రావిస్ హెడ్ (533 పరుగులు), అభిషేక్ శర్మ (467) ఎలా ఆడతారన్నదానిపైనే సన్‌రైజర్స్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ విజయాలలో వీరిదే అగ్రతాంబూలం అని చెప్పక తప్పదు. ఈ ఇద్దరూ తొలి 8 ఓవర్ల పాటు క్రీజులో నిలిస్తే స్టార్క్ అండ్ కో.కు బడిత పూజ తప్పదు. మూడో స్థానంలో రాహుల్ త్రిపాఠికి మరోసారి అవకాశం దక్కితే అది జట్టుకు మేలు చేసేదే. వైజాగ్ కుర్రాడు నితీశ్ రెడ్డి అంచనాలకు మించి రాణిస్తుండటం ఎస్ఆర్‌హెచ్‌కు అదనపు బలం. పంజాబ్‌తో మ్యాచ్‌లో క్లాసెన్ ఫామ్‌లోకి రావడం హైదరాబాద్‌కు శుభసూచకమే.

**పిచ్**
అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామమే అయినా గత 12 మ్యాచ్‌లలో ఇక్కడ 200+ స్కోర్లు నమోదైంది రెండు సార్లే. రెండో సారి బ్యాటింగ్ చేసే జట్టుకు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి.



**తుది జట్లు (అంచనా):**

**కేకేఆర్:** నరైన్, గుర్బాజ్, శ్రేయస్ (కెప్టెన్), వెంకటేశ్, నితీశ్, రింకూ, రస్సెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్, చక్రవర్తి

**ఎస్ఆర్‌హెచ్:** హెడ్, అభిషేక్, త్రిపాఠి, నితీశ్, క్లాసెన్, షాబాజ్, సమద్, సన్వీర్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.